# అక్కాచెల్లెల్లు

7 అక్టోబరు 1984

అక్కా!

ఇంతకాలానికి మేం బతికేవున్నట్లు నీకు జ్ఞాపకం వచ్చిందీ! సంతోషం. మాకు తెల్సు అక్కయ్యా! ఏనాటికైనా మమ్మల్ని నువ్వు గుర్తు చేస్తావని. సుత్తెవైన పట్నం సంసారం నీది! కొడవలినైన పల్లెటూరి సంసారంమాది. సంఘటిత కార్మిక రంగం నువ్వు. అసంఘటిత రైతాంగాన్ని నేను. ఎన్నాళ్ళుగానో నువ్వు సుత్తెవై నేను కొడవలినై వున్నాం. ఇన్నాళ్ళకు మా యోగక్షేమాలు అడిగావు. విశేషాలు ఎన్నని రాయను. ఒకటా రెండా ఎక్కణ్ణించని మొదలెట్టను?

ఈ మధ్య చాలా గ్రామాల్లో నాలుగయిదుసార్లు పోలీసు జీపు తిరిగిపోయింది. ఆ మధ్య చాలాచోట్ల పోలీసు పటేళ్ళకు, పోలీసు ఇన్ఫార్మర్లకు దేహశుద్ధి జరిగిన్నించి వీళ్ళపని మరీ కష్టమైపోయింది. ఇన్ఫర్మేషన్ అందించేవారే కరువయిపోయారు. ఒక పల్లెను తీసుకుని చెప్తాను.

రామయ్య పల్లెలో కుంటి ఎల్లయ్య సారా అమ్ముతాడు. కాని సారా కాంట్రాక్టర్ కాడు. గౌడ కులస్థుడు. తాటిచెట్టుమీంచి జారిపడ్డాక డాక్టర్లు ఒక కాలు తీసేశారు. సంగం యిలా ఉపాధి కల్పించి ఆ కాలు అమర్చింది. సారాని కాంట్రాక్టర్లు నిర్ణయించిన ధరకే ఏ వూళ్ళో అయినా అమ్మేది. అమ్మేవాళ్ళకు లీటరుకు రూపాయి అని కమీషన్ యిస్తారు. జీతం పెట్టుకుంటే ఖర్చు బరువు బాధ్యతలు ఎక్కువ అని వాళ్ళు ఈ పద్ధతి ప్రవేశపెట్టారు. కాగా సారా ధర తగ్గాలని పోరాటం చేస్తున్న క్రమంలో వాళ్ళ ఇన్ఫార్మర్ నగుబోతు వీరయ్యని కూడా వదిలించుకున్నారు. కుంటి ఎల్లయ్యకు సారా దుకాణం అప్పగిస్తేనే ధర తగ్గించినా సారా అమ్మగలిగేది అని డిమాండ్ చేసింది సంగం. వాళ్ళ గొంతులో పచ్చివెలక్కాయ పడింది. అయినా ఏం చేయలేమని గ్రహించుకుని ఒప్పేసుకున్నారు.

అలా పోలీసులకు ఏజెంటు లేకుండాపోయాడు. పోలీసు జీపుకి మగవాళ్ళెవరూ తారసపడ్డట్టు లేదు. ఇక స్త్రీలు, పిల్లలు, ముసలివాళ్ళని పట్టుకొని ఎవరినని బెదిరించడం? వాళ్ళకి తరువాయి దొరికినట్టులేదు. ఈ సంవత్సరం వర్షాకాలం పూనే ముందు, సమ్మెచేసి పాలేర్ల జీతాలు, కల్పించాల్సిన సౌకర్యాలు, మిగతా కూలీలు పెంచుకున్న విషయం కూడా వాళ్ళకు తెల్సినట్టులేదు.

ఓ నాలుగు నెలలకు మా పత్రికల్లో రెండులైన్ల వార్త వచ్చింది. బహుశా దానివల్ల తెలుసుకొనివుంటారు. ఇలా యిక్కడి గ్రామాల్లో శత్రువుకూ, ప్రజలకూ మధ్య సమాచార వంతెనలన్నీ ఒక్కొక్కటి తెగిపోతున్నాయి. తెంపిందీ తెగ్గొడుతున్నదీ వాళ్ళే మేం కాదు. వాళ్ళ

సమాచార వంతెన తెగిపోవడం అంటే ప్రభుత్వం తన లెజిటిమసీని (చట్టబద్ధతని) కోల్పోవడం.

మైకుండే సభలకు పర్మిషన్ నిరాకరిస్తూ మైకులేని సభల్ని విచ్ఛిన్నం చేస్తూ వాళ్ళు సాధించింది యిదే. డెయిలీ పేపర్లలో, రేడియోల్లో ఈ వార్తలు రావు. వచ్చినా జిల్లా పేజీలకు పరిమితం. ఇక నీకు ఎలా తెలుస్తాయి. ఇక్కడి పరిస్థితి ఏమిటో వాల్ పోస్టర్స్ చూసి కానీ గ్రహించలేని స్థితి పోలీసులకే వుందాయె. కొన్ని లీగల్ అవకాశాల్ని ఎప్పటికీ యిస్తూనే వుండాలి అని కొందరు ఐపిఎస్‌లూ, వాళ్ళ నాయకులూ ఎందుకు వాదిస్తారో, దాని లోగుట్టు యిదే తప్ప ప్రజలపట్ల ప్రేమ ఉప్పొంగికాదు.

అందువల్ల బహిరంగ అవకాశాలు ప్రజలకు ఉద్యమాలకు ఎంత అవసరమో తమ, అధికారం చెల్లుబాటు కావాలంటె ప్రభుత్వాలకూ అంతే అవసరం.

ఎస్సయి ఆ వూళ్ళో సుంకరి మల్లయ్యనీ, పోలీసు పటేల్ని హెచ్చరిస్తే వాళ్ళేమన్నారో తెల్సా! "అయ్యా! ఈ తెలుగుదేశం పట్వారీలని (కరణాలని) పీకేసిన చేత్తో మమ్మల్నెందుకు పీకేయలేదో అర్థం కావట్లేదు. మీకు పుణ్యం వుంటుంది. మమ్మల్ని పీకేయిస్తే గుళ్ళో టెంకాయ కొడతాం". ఇక ఎస్సయికి తన ప్రతాపం ఎవరిపైన చూపాలో అర్థం కాలె. రోడ్డంట కన్పించిన వారినల్లా బాది లాఠీ తీట, నోటి తీట తీర్చుకున్నాడు. "లంజకొడుకుల్లారా సారా బందు పెట్టే వాళ్ళయ్యారా? 2, 3 రోజుల్లో మీరంతా తాగకపోతే మీ చర్మం వొలిచేస్తా"నన్నాడు. తన్నులు తిన్నవాళ్ళు అలాగేనని తల ఊపారు. జీపు అటు కదలగానే మళ్ళీ మామూలే.

ఈనాడు యిక్కడ దేన్లో చూసినా పోలీసులే. జనం కూలీలు పెంచుకుంటే వాళ్ళే, పోట్లాడుకుంటే వాళ్ళే. దొంగలుపడ్డా వాళ్ళే. సభలు పెట్టుకున్నా వాళ్ళే. భూములు లాక్కున్నా వాళ్ళే. ప్రభుత్వాలను ఏర్పరచి చల్లని పాలన యిస్తామనే హామీల్తో ఓట్లు లాక్కుపోయిన నేతలు మాత్రం ఇక్కడ కానరారు.

ఆ వూరి బుచ్చవ్వ ఎస్సయిని ఒకసారి ఏమని నిలదీసిందో తెల్సా! "సారా తాగాలని అన్నట్టుగా రోజూ మూడు పూటలా అన్నం తినాలని, తినకపోతే ఆరోగ్యం చెడిపోతుందని పోలీసులు ఎందుకు బలవంతం చేయరు? బ్లాకును అరికట్టి కిరసనాయిల్‌ని కంట్రోల్ రేటుకు ఎందుకు పోయించరు? అలా పోయించి రోజూ యింట్లో దీపం పెట్టుకోవాలి. చీకట్లో అన్నం తింటే పురుగులు పడతాయి అని ఎందుకు చెప్పరు? సర్కారూ, మీరూ చేసే పనులెన్నో వుండగా సారా తాగాలని మాత్రమే మా పల్లెల వెంట ఎందుకు తిరుగుతరు? గాంధీ ఏమన్నాడో తెల్సా? సారా తాగకూడదనేగా చెప్పింది. రాజ్యాంగంలో సైతం రాశారటగా. అయినపుడు ఈ సర్కారూ, పోలీసులూ మాకు మద్దతు ఇవ్వకపోగా ఈ దౌర్జన్యాలేమిటి?"

అక్కయ్యా! నీకు వాళ్ళ మనసులో మాట చెప్పనా? మళ్ళీ ఎవరితో అనకు. బుచ్చవ్వలాంటి వాళ్ళయితే సారా కాంట్రాక్టర్లు రేటు తగ్గించకపోతేనే బావుంటుందని చెప్తారు. 'పల్లెకు పట్టిన పీడా వదులుతుంది. ఆ పైకం ఏ కూరనారకో అక్కరకొస్తాయి. అయిదు నెలలు దిగిరానివాడు ఆ కాస్తా ఏడు నెలలు ఓపికపడితే పోయె. ఏడాది గడిచి పోయేది. అలా సారా అలవాటు చచ్చినట్టు మానిపోయేది. మహా అయితే రోజు రూపాయి 'కల్లుబింకి' కొందరు వాడకం పెట్టుకునేవాళ్ళేమో. ఆనాడు సంగమే పూనుకుని గౌండ్లవాళ్ళతో సొసైటీ పెట్టించడం ఈనాడు ఎంతో అక్కరకొచ్చింది. అదే లేకపోతే ఎవడో కల్లు కంట్రాక్టరు పుట్టుకొచ్చి సారా బందు పెట్టారని కల్లురేటు పెంచికూర్చుంటే వాళ్ళతోనూ పోరాటం చేయాల్సివచ్చేది' అని అంటారు.

ఈ పోరాటం చేస్తే పోలీసు దెబ్బలు తప్ప ఈ పల్లెలు బావుకున్నదేమీ లేదనే

మహానుభావులు కొందరున్నారు. కాగా ఈ పోరాటం చేస్తే అటు సారా ధర తగ్గింది. ఇటు వూళ్ళూ బాగుపడ్డాయి. ఈ నాలుగేళ్ళ నుండి ఈ పోరాటం నుంచి ప్రజలు ఎన్ని నేర్చుకున్నారో! ఈ పోరాటమే లేకపోతే అవన్నీ ఎలా తెలిసేవి? నాలుగేళ్ళ క్రితం ఈ సారా పోరాటం మొదలెట్టినపుడు ఊరంతా ఒక్కటై ఐక్య సంఘటనగా నిలబడింది. గుడికి చందా యిమ్మని డిమాండ్ చేశారు. అలా గుడి కట్టించుకున్నారు. కొత్త 'మాప్‌లా' అక్టోబరు నెలరాగానే మళ్ళీ పోరాటం చేశారు. అప్పుడు బడిలో రెండుగదులు పెంచుకున్నారు. అయితే ఆ బడి కట్టించిన సొమ్ములో ఆ వూరి సంగసభ్యుడు కొమురయ్య వెయ్యి రూపాయలు తప్పుడు లెక్కలు రాసి దిగమింగాడు. పైపెచ్చు ఒకపైసా కూడా తినలేదని దేవునితోడు, సంగంతోడు అంటూ ప్రజా పంచాయితీలో ఒట్లేసుకున్నాడు.

కాని విషయం కళ్ళముందే కనబడ్తోంది. ఈ పూటకు లేనివాడు అక్కడ పెరట్లో బావితవ్వకం మొదలెట్టాడు. సాక్ష్యం దొరక్క పోనీలే అని వదిలేశారు. 'మనందరం కల్సి చందాలేసుకుని బావి తవ్వించాం అనుకుందాం పోనీ' అని అందర్నీ సముదాయించాడు ఆ వూరి సంగాధ్యక్షుడు రాజన్న.

రాజన్నంటే పూర్వపు పల్లెటూరి బైతు అనుకునేవు. ఆ మధ్య జనతాపార్టీ కాలంలో అనుకుంటాను. ఎనిమిది నెలలు జైల్లో గడిపి, గొంగళిపురుగు సీతాకోక చిలుకగా మారినట్లుగా మారి వూరుచేరాడు. చిన్నప్పుడు తిండికి వెళ్ళక పాలేరుగా వుండటంతో బడికి వెళ్ళలేదు. జైల్లో ఆ ఎనిమిది నెలల్లో అక్షరాభ్యాసం చేశాడు. ఇప్పుడు మార్క్స్ 'కమ్యూనిస్టు ప్రణాళిక' నించి మావో 'వైరుధ్యాలు' దాకా గడగడ చదవడమే కాదు, పుస్తకం చూడకుండానే అప్పగిస్తాడు. మొదట్లో రాజన్న పరిష్కారానికి కొందరు లోలోన గొణుక్కున్నారు. తర్వాత రాజన్న మాటే మంచిదయ్యిందని పొగిడారు వాళ్ళు. 'లేకపోతే పోలీసు ఇన్ఫార్మరయి కూచుంటే ఏవేవో కేసులు పెడితే అలా ఖర్చులు కాకపోయేవా. కొమురయ్య యిప్పుడు సంగం చెప్పినట్టు బుద్ధిగా నడుచుకుంటున్నాడాయె'.

కానీ కొమురయ్యకు చెప్పకుండానే, మాట్లాడుతూనే ఒకరకమైన సాంఘిక బహిష్కరణ అమలుజరిపారు వాళ్ళు. అతడికి తానెంత ఒంటరో కొంతకాలానికి తెలిసివచ్చింది. అది గ్రహించాక ఒక్కసారయినా అన్నలను కలపండి అంటూ వేడుకున్నాడు. ఓ రోజు అన్నల కాళ్ళపై పడ్డాడు. ఒకటే ఏడుపు. అలాంటి గుణం తనకెన్నడూ లేదనీ, అంత సొమ్ము ఒక్కసారి చూసేసరికి బుద్ధి వక్రీకరించి అలా చేశానని ఒప్పేసుకున్నాడు. ఆ వెయ్యి సంగానికి కడతాను కానీ సంగానికి దూరం చెయ్యొద్దని చేతులు పట్టుకున్నాడు. కళ్ళనీళ్ళ పర్యంతరంగా విలపించాడు. కాని కక్కినదానికి ఆశపడ్డం ఎందుకులే అన్నారంతా.

ఆ సందర్భంగా ఆ రోజు ప్రజా పంచాయితీలో జరిగిన చర్చ ఎన్ని పరిణామాలకు దారితీసిందో నువ్వు ఊహించగలవా? కొమురయ్య అలా మారడం, తిరిగి మంచోడు కావడం అలా జరగటానికి కారణం డబ్బే కదా అన్నారు కొందరు. 'ఆ డబ్బు స్కూలు బిల్డింగ్ కట్టించడానికేగా! అయితే ఈ స్కూలు బిల్డింగ్ మనమే ఎందుకు కట్టించాలి. కొమురయ్య వంటి మంచివాళ్ళని ఎందుకు చెడగొట్టుకోవాలి. ఇందులో అసలు దొంగలెవరు. ఈ ప్రభుత్వం కాదా – ఈ స్కూల్‌ని గ్రామ అవసరాలకు సరిపడా కట్టిస్తే కొమురయ్య ఎందుకు దొంగ కావాల్సివచ్చేది? ఇలా సాగిన చర్చ వాళ్ళని ఎక్కడి దాకా తీసికెళ్ళిందనుకున్నావు.

ఆ గ్రామం పేరిట ప్రభుత్వం ఏటా ఒక్కసారాతోనే రెండులక్షలు సంపాదిస్తున్నట్లు లెక్కతేల్చారు. సినిమా వినోదపు పన్ను ఆదాయంలో తొంభయి శాతం ఆయా స్థానిక గ్రామ

పంచాయితీలకు చెందినట్టు ఈ సారా డబ్బు కూడా తమ గ్రామ అభివృద్ధికే ఎందుకు పెంచకూడదు? అలా ఎందుకు ఖర్చుపెట్టకూడదు? ఇతర సరుకుల కొనుగోలుద్వారా ప్రభుత్వం ఏకో రెండు లక్షలపైనే తమ గ్రామం మీద సంపాదిస్తోంది. అంత డబ్బు ప్రభుత్వానికి రాగా అముకుతామై ఎందుకు బడి కట్టించాలి? అలా అయితే ఈ ప్రభుత్వం ఎందుకున్నట్టు? వచ్చిన ఆదాయాన్ని 'అంబుక్క' అని స్వాహా చేయడానికా? అదేం కుదరదు. తమ వూరిపై ఎంత ఆదాయం వస్తుందో విదేశీ అప్పులు మా కోసం ఖర్చుపెట్టకపోతేమానె ! మా డబ్బు మా వూరిపైనే ఖర్చు పెట్టాలి' అని నిలబడ్డారు. అందుకు సర్పంచ్ రంగారావును ఆ వూరి రోడ్డుగురించి కమ్యూనిటీ హాలు గురించి, చెరువుల రిపేరుగురించి బడ్జెట్ మంజూరు చేయించుకు రమ్మన్నారు. లేకపోతే యింటిపన్ను కట్టం. నువ్వీ వూరిలో వుండవ్ అన్నారు.

ఈ అల్టిమేటం బాగా పనిచేసింది. సంగం పోరు పడలేక సర్పంచ్ ఆ వూరి రోడ్డుకూ, చెరువుకూ మళ్ళీ కంకరతో రిపేరింగూ, బడిలో రెండు గదులూ, రెండు టీచర్ పోస్టులూ శాంక్షన్ చేయించుకొచ్చాడు. ఇలా సారా పోరాటం వచ్చాక గ్రామాల్లో జనం ఎంతో కొంత చైతన్యవంతులయ్యారు. ఎన్నో మంచి పనులు చేశారు. కేవలం ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 16 జూనియర్ కాలేజీలు. 3 డిగ్రీ కాలేజీలు అదనంగా ఏర్పడ్డాయి. స్కూళ్ళని ప్రైమరీ నుంచి అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌గా, అప్పర్ ప్రైమరీ నుంచి హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేసుకున్నారు. ఈ సారా పోరాటంలో గ్రామ అభివృద్ధి ఫండ్ ద్వారా యింకా యిలా మరెన్నో... పనులు చేపట్టారు. అయితే వాళ్ళేదో పనిలేక ఈ సారా పోరాటం చేస్తూ అనవసరంగా నిర్బంధాలు కొని తెచ్చుకున్నట్టూ అనుకునేవాళ్ళు – ఆ పద్ధతిలో చూపించే సానుభూతి వాళ్ళకు అవసరం లేదు. చేతనయితే వాళ్ళతో కలిసి పనిచెయ్, లేదా మాట మద్దతయినా యివ్వు. ఈ పోరాటాల గూర్చి నీ చుట్టుపక్కలవాళ్ళకు చెప్పి గర్వపడగలగాలి. అక్కా ! నీనుండి యింతకన్నా ఏం ఆశించను?

"జీవితంలో ఎన్నో ధక్కామొక్కీలు తిన్న అక్కా ! మన ఇల్లు చక్కదిద్దుకోవడం అంటే ఈ దేశాన్ని చక్కదిద్దడం. ఈ ప్రపంచాన్ని చక్కదిద్దడం. మన యింట్లోని అగ్గిపెట్టె విదేశీ సహాయంతో తయారైంది. మన కిరోసిన్‌గ్యాస్ విదేశాలనుండి వచ్చింది. నీవు తినే అన్నం – వరి వండడానికి కావలసిన ఎరువులు విదేశాల సాంకేతిక విజ్ఞానంతో వచ్చాయి. మనకు శక్కెర, కిలో 8 రూ॥లు కావటానికి విదేశీ అప్పులు వడ్డీకింద కిలో రూపాయికి అమ్మడం కారణం. మనం సృష్టించే ప్రతి రూపాయిలో 30 పైసలు ఆయుధాలు కొనుగోలుచేసి మనుషుల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. మన శ్రమశక్తితో సంపాయిస్తున్న డబ్బుకు విలువ తరగడం అంతర్జాతీయ సంక్షోభ ఫలితం.

కొందరంటుంటారు. తాగేవాడే కడతాడు తాళ్ళపన్ను అని. కాని అది పూర్తి నిజం కాదు. తాగనివాళ్ళు కూడా తాగేవాళ్ళ పన్ను కడుతున్న వ్యవస్థ యిది. రోజురోజుకూ ధరలెందుకు పెరుగుతున్నాయో చూశావా? ధరల పెరుగుదలకు అనేక కారణాలున్నాయి. ఉత్పత్తి ఖర్చులు, అద్దెలు, రవాణా, నిర్వహణా ఖర్చులు పెరగడం, బ్లాక్‌మార్కెట్ చేయడం, పన్నులు పెంచడం మొదలయినవి అందులో కొన్ని. దొంగనోట్లవల్ల, ఉత్పత్తికి సంబంధంలేని ఖర్చులవల్ల, అధికనోట్ల ముద్రణవల్ల, లోటు బడ్జెటువల్ల సరుకుల ధరలు పెరుగుతాయి. అయితే ఏటా పెరుగుతున్న సారా ధరలవల్లకూడా మొత్తం సరుకుల ధరలు పెరుగుతున్నాయని మాత్రం చాలామందికి తెలియదు.

ప్రతి ఏటా జూలై, ఆగస్టుల్లో సారా వేలంపాటలు సాగుతాయి. ఇవి ఏ పద్ధతిలో

నిర్వహించాలని ఏటా ప్రభుత్వం తర్జన భర్జనలు పడుతుంది. అధిక ఆదాయం రాబట్టడమే ప్రభుత్వ పాలసీ. ఈ విధానంవల్ల మద్యం, సారా తాగనివాళ్ళ కొంపలు కూడా కూలుతున్నాయి. ఏటా తెలుగుదేశంలోని ప్రతి కుటుంబం సగటున 1600 రూ॥లు నష్టపోతున్నాయి. రోజూ 10 రూ॥లు తాగే రిక్షావాలా, కార్మికుడూ, రైతుకూలీ కుటుంబాలయితే ఏటా మూడున్నర వేల రూపాయల చొప్పున అదనంగా నష్టపోతున్నాయి. ఇలా తెలుగు ప్రజలు ఏటా మొత్తం 1600 కోట్ల రూ॥ల విలువగల జీవితావసర సరుకుల్ని నష్టపోతున్నారు. అయిదు పదికోట్ల విలువయినా లేని పుస్తకాల, నోటుబుక్కుల ధరల గురించి, బస్సు ఛార్జీల గురించి మాత్రమే పరిమితమై ఆందోళన చేసే కొందరు 1600 కోట్ల రూ॥ల ధరల పెరుగుదలా, కుంభకోణాల గురించి ఆలోచించకపోవడం ఆశ్చర్యకరం. చిట్టెలుకలు దూరే కంతలు కన్పించినవారికి ఏనుగులు దూరే ఈ కంతలు కన్పించకపోవడం ఆశ్చర్యకరం కాదు. మోసం, దగా, కుట్ర, ఎక్కడో స్విస్‌లోని రహస్య పత్రాల్ని కనుక్కొని బోఫోర్సుని బట్టబయలు చేయగలిగినవాళ్ళకు కళ్ళెదుట కన్పించే యివి తెలియవని ఎలా అనుకుంటారు? ప్రభుత్వ సారా పాలసీయే మనం 1600 కోట్లు నష్టపోవడానికి కారణం. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం అమ్మకం పన్ను. ఆ తర్వాత అతి పెద్ద ఆదాయం సారా. ఈ ఏటి ప్రభుత్వ సారా ఆదాయం 500 కోట్ల రూపాయలకు పైగా వుండాలని అంచనా వేశారు. అయితే కాంట్రాక్టర్లు, తదితర అన్నివర్గాలు కలిసి ఈ ఏడు మద్యం, సారాద్వారా ప్రజల్నించి రాబట్టుకునే ఆదాయం 1600 కోట్లు అని ఒక అంచనా. కాగా 'ఈనాడు' డెయిలీతో సహా సారా తయారీ ఖర్చు లీటరుకి 30 పైసలు అన్నారు కొందరు. కొందరు ఒక్కోసారి 50, 60 పైసలు కావొచ్చునన్నారు. కాగా మార్కెట్లో సారాని లీటరుకు పాతిక నుంచి యాభై రూపాయల దాకా అమ్ముతున్నారు. సగటున లీటరు 35 రూపాయలు అనుకుంటే ఒకే ఒక్కరూపాయి విలువగల సరుకిచ్చి డెబ్బై రూపాయలు తీసుకుంటున్నారు. ఈ లెక్కన 30 కోట్ల రూపాయల మద్యం, సారా యిచ్చి 1600 కోట్ల రూపాయలు లాగేసుకుంటున్నారు. ఈ పద్ధతి వల్ల ఏటా 1600 కోట్ల రూపాయల ప్రజల సరుకుల్ని వీళ్ళ స్వాహా చేస్తున్నారన్నమాట. 1600 కోట్ల దొంగనోట్లు ముద్రించి చెలామణిచేస్తే ఏం జరుగుతుందో ఈ పద్ధతివల్ల అదే జరుగుతుంది.

మనం సరుకుల విలువని మార్చుకునే సౌకర్యంకోసం డబ్బు రూపంలో కొలుస్తాం. స్వతహాగా సరుకు విలువ దాని తయారీ ఖర్చునిబట్టి ఉంటుంది. ఇందులో ముడిపదార్థాల ధరలు, కరెంటు ఛార్జీలు, అద్దెలు, వడ్డీలు, లేబరు చార్జీలు కూడా చేరివుంటాయి. ముడిపదార్థాలు, కరెంటు చార్జీలు, అద్దెలు వగైరా అంతిమంగా శ్రమ విలువే. దొంగనోట్లు తయారుచేసి, చలామణిచేసి 1600 కోట్ల రూ॥ల సరుకు కాజేయడం అంటే అర్థం ఒక్క సరుకయినా మార్కెట్లోకి తేకుండా 1600 కోట్ల రూ॥ల ప్రజల ఉమ్మడి సరుకుల్ని దొంగల్లా దోచుకుపోవడం, దీంతో 'సప్లయి-డిమాండ్' సూత్రం ప్రకారం సరుకుల ధరలు ఆ మేరకు పెరుగుతాయి. లేదా ప్రజల కొనుగోలుశక్తి నష్టపోవడం జరుగుతుంది.

ఇప్పుడిది సారా తాగేవాళ్ళ సమస్య మాత్రమే కాదు అందరి సమస్య అయి కూర్చుంది. మన రాష్ట్రంలో కోటి కుటుంబాలున్నాయనుకుంటే ఏటా సగటున ఒక్కో కుటుంబం ఈ విధంగా 1600 రూ॥లు నష్టపోతోంది. కార్మికుడు, రైతుకూలీ, రిక్షా కార్మికుడు రోజూ పదిరూపాయలకు తాగితే ఏటా మూడున్నర వేల రూ॥లు అదనంగా నష్టపోతున్నాడు. ఒక్క సారానే కాదు, ఏ సరుకయినా దాని తయారీ విలువ కన్నా ఎక్కువ ధరకు అమ్మడం వలన కొనుగోలుదారులు నష్టపోవడం సహజమేకదా! ఇలా ప్రతి కుటుంబం సగటున 1600

రూ॥లు సారా కంట్రాక్టర్లకూ, ప్రభుత్వానికి చచ్చినట్టు చెల్లించాల్సి వస్తోంది. సారా ధర పెంచడంవలన నష్టపోతున్నది తాగేవాళ్లే కాదు ఇలా తాగనివాళ్ళు కూడా, డెబ్బయి రూపాయల సరుకుల్ని ఒక రూపాయి యిచ్చి ప్రభుత్వం ఎత్తుక పోవడంవల్ల నష్టపోక ఏంచేస్తారు.

ఇదే పద్ధతిలో రాష్ట్ర బడ్జెట్‌ను లెక్కేద్దాం. ఈ ఏడు రాష్ట్ర బడ్జెటు 1200 కోట్లు. అంటే ఒక్కో కుటుంబంనించి సగటున 1200 రూ॥ల్ని పన్ను రూపంలో వసూలు చేస్తోంది. (సారావలన నష్టపోతున్నది కూడా కలిపితే ప్రతి కుటుంబం 2800 రూ॥లు నష్టపోతోంది). ఇంకా యిందులో బ్లాక్ మార్కెట్ టాటా బిర్లాల, బహుళజాతి కంపెనీల దోపిడీ, కేంద్రప్రభుత్వ పన్నులు తదితరాలు చేర్చితే ఇది ఎంతవుతుందో ! కనీసం రెట్టింపు అనుకున్నా ప్రతి కుటుంబం నుంచి సగటున 5600 రూపాయలు ఏటా పన్నుల రూపంలో, దోపిడీ రూపంలో లాభాల రూపంలో పిండుకుంటున్నారు.

ప్రతి కుటుంబం నుంచి సగటున 5600 రూ॥ల్ని ప్రజల గోళ్ళూడగొట్టి వసూలు చేస్తోన్న ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ఏదేది ఎంతెంత ఖర్చు చేస్తున్నదో తెల్సుకునే హక్కూ బాధ్యతా వుంది. ఇలా పోల్చిచూస్తే తాము రోడ్డుమీద నడచినా నడవకపోయినా ఒక్కో కుటుంబం సగటున రోజూ రూపాయి పన్ను చెల్లిస్తున్నామని తెలుసుకుంటారు. ఇలా ప్రతిదీ లెక్కలు తీసి చెప్పాలి. ఇలాంటి అవకాశాన్ని ప్రతిపక్షాలు ఎంతయినా వినియోగించుకుని ప్రభుత్వాన్ని గూర్చి ప్రజలకు తెలియజేయవచ్చు. కాని అందరు ఒక్కాకులో తినేవాళ్ళేగా! ఇలాంటి లెక్కలు తీయడంవలన పౌరుడు తాను చెల్లిస్తున్న పన్నుకీ అనుభవిస్తున్న సౌకర్యాలకీ పోల్చిచూసి రెంటిమధ్య అంతరం ఎంతుందో తెల్సుకుంటాడు. ఈ అంతరం అవినీతి, దుబారా, దోపిడీ కింద లెక్క. కనుక పత్రికలు ఇలాంటి లెక్కల్ని ప్రచురిస్తూవుంటే ఎంతోకొంత ధరల పెరుగుదలకు కారణాలు తెలుస్తాయి. ఆ తర్వాత సంగతి ప్రజల ఇష్టం.

మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ప్రభుత్వం, దోపిడీదారులు ఏటా ఒక్కో కుటుంబం నుంచి సగటున 5600 రూ॥లు పిండుతున్నారు గదా! ఇంతపెద్దమొత్తాన్ని పిండుకున్న ప్రభుత్వం ఆ కుటుంబంలో ఎవరయినా ఆకస్మికంగా చనిపోతే ఆ కుటుంబ సంక్షేమం పట్ల తీసుకుంటున్న బాధ్యత నిండుసున్న, 1978లో జనతాపార్టీ అధికారంలోవున్న హయాంలో ఏటా 12 రూ॥లు కట్టే జనతా బీమా పాలసీపై ఆకస్మిక మృతికి 12 వేలు ఇచ్చే పథకం ప్రవేశపెట్టారు. కాగా ఏటా 5600 రూ॥ పిండుకుంటున్న ప్రభుత్వాలు, దోపిడీదార్లు మాత్రం 500 రూ॥లో వెయ్యో ఎక్స్‌గ్రేషియో ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారు. అదీ హక్కులాగా కాదు. భిక్షంలా తనకిష్టమైనప్పుడు పత్రికల్లో ప్రచారం జరిగినపుడు యిస్తోంది. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అని ఓట్లేసి ఎన్నుకున్న గార్డియన్ ప్రభుత్వాలు చేసే నిర్వాకాలు యిలా వుంటాయి.

(2004లో మద్యం ద్వారా ప్రభుత్వ ఆదాయం 5వేల కోట్లు. మద్యం టర్నోవర్ 15వేల కోట్లు. ఈలెక్కన మద్యంవల్ల మద్యం తాగని కుటుంబం కూడా ఏట 15వేల రూపాయల కొనుగోలు శక్తిని, విలువను నష్టపోతున్నది.)

అందువలన ఈ మద్యం వ్యాపారం బందవుతే ప్రభుత్వ స్వరూపమే మారిపోతుందని ప్రభుత్వానికి తెలుసు. తెలియనిదీ, తెలియకుండా చేస్తున్నదీ ప్రజలకే. సారా బందవుతే సారామీద సంపాదనా బందవుతుంది. ఈ సారా కాంట్రాక్టర్లు ఎవరు? వెనకటి భూస్వాములో, ఏ ఎమ్మెల్యేలకో, మంత్రులకో బంధువులు, లేదా బంధువుల పేరిట వాళ్ళే పడతారు. అంటే ఏంటి? ఇటు వాళ్ళ జేబులు నిండవు. అటు ప్రభుత్వం నడవదు. ఇక్కడ నీవు యింకో

విషయం గమనించావా? సారా పోరాటాల్ని యిన్ని నిర్బంధాల్ని అధిగమించి చేయగలిగినవాళ్ళు రాష్ట్రానికి మరో ప్రధాన వనరయిన సేల్సు టాక్సు కట్టవద్దని సహాయ నిరాకరణ చేయలేరా? అదే జరిగితే ప్రభుత్వం తన రక్షణ కోసం అని పెంచుకున్న పోలీసులకయినా జీతాలు ఎలా యివ్వగలదు? ప్రభుత్వం కాగితంపులి అంటే ఏమిటి? ఇది కాదూ! కాగా యిలా సారా పోరాటంవల్ల ప్రభుత్వాదాయం తగ్గుతుంది. తద్వారా ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల పేరిట రెండువందల కోట్లు ఈ నాయకులు కాంట్రాక్టర్ల రూపంలో దిగమింగడం తగ్గుతుంది. వాళ్ళ పార్టీలకు చందాల దొరకవు. మరీ దౌర్భాగ్యం ఏమంటే సారా తాగొద్దనే గాంధీ టోపి యిస్త్రీకి, కాషాయ వస్త్రాల యిస్త్రీకి కూడా ఈ సారా తాగే రైతుల, తాగని ప్రజల రక్తం చెమటా కావాల్సి వస్తున్నాయి.

నీవు యింకో విషయం గమనించావా అక్కా ! జనం తాగడంవల్ల నష్టపోతున్నది డబ్బొక్కటే కాదు, తమ సంస్కృతి కూడా, ఎలాగంటే ఈ రోజు పనిచేసి నువ్వు పది రూ॥ల సారా తాగేశావనుకో ఆ పది సారాకు చెందిపోతాయి. ఈ సారా అమ్మేవాళ్ళు ఆ డబ్బుతో ఏదయినా కొనుక్కోవడం సహజం. తిరిగి ఆ డబ్బుని నీకు కూలీగా యిచ్చి నీ శ్రమశక్తిని వినియోగించుకుంటారు. దోచుకుంటారు. మొదటిసారి తాగినపుడు నీకిష్టమైన పనిచేసి సంపాదించావు. రెండోసారి నీకిష్టమైన పనిచేయడం అనేది నీ చేతుల్లో లేదు. వాళ్ళకిష్టమైన పనిచేస్తేనే నీ పది నీకు కూలీగా చేతికొస్తాయి. అంటే నీవు మద్యం తాగడంవల్ల నీ శ్రమ ఫలితాన్ని కోల్పోవడమే గాక ఈ మద్యం వ్యాపారుల కోర్కెలకు, విలాసాలకు, నీచ సంస్కృతి, దోపిడీ నాగరికతలకు అనుగుణంగా పనిచేయాల్సిన యంత్రానివో, బానిసవో అయిపోతావు. దీన్ని సరుకుల మాయ (పెటిసిజం) అంటారు. సరుకుల మాయంటే కూరగాయల మార్కెట్లో కిలోరాయితో తూచి అరకిలోకన్నా ఎక్కువ తూగకుండా ఉండికొట్టడం అనుకునేవు. ఆలోచిస్తే ఒకరకంగా అంతే. నీవూ నేనూ ముడిసరుకులకు శ్రమశక్తిని జోడించి సరుకుని సృష్టిస్తాం. మనం సృష్టించే ఈ సరుకు మార్కెట్‌ని సృష్టిస్తుంది. ఈ మార్కెట్టే చివరకు ఎలా మనని కంట్రోల్ చేస్తుందో సారా ఉత్పత్తి అమ్మకాల్లో చూశాం.

అలాగే ఆ వూళ్ళోని భూస్వామి చూడు. ఆయన పూచిక పుల్లని యిటునుండి అటుపెట్టి ఎరగడు. ఆ వూళ్ళో ముప్పాతికవంతు భూములు ఆయనవే. రైతులు, కూలీలు, కష్టించి పనిచేస్తే, ఆస్తులు పెంచుకున్నాడు. వెనకట రాజులు పెళ్ళాల్ని, వేశ్యల్ని, సైనికుల్ని పెంచుకున్నారు. ఇపుడు గూండాల్ని పెంచుకుంటున్నారు. ఆ గూండాల్తో, పోలీసుల్తో, ఆ రైతుల్నే తన్నిస్తున్నారు. ఇక్కడ ఏం జరిగింది? కార్మికులు, రైతుకూలీలే సరుకును సృష్టించారు. కాని ఆ సరుకుయొక్క పెత్తనానికే అధీనులుగా బానిసలుగా మార్చబడ్డారు. ఆ సరుకే పరస్పర విరుద్ధ సాంఘిక వర్గాల్ని, అంతస్తుల్ని, పరస్పర విరుద్ధ సంస్కృతిని సృష్టించింది. ఇవి రెండూ పరస్పరం సంఘర్షిస్తాయి. ఈ సంఘర్షణ ఆ సరుకుని సృష్టించిన మనిషి నించి పరాయీకరణ చెందకుండా అడ్డుకునేదాకా సాగుతుంది.అంటే ఈ దోపిడీ వ్యవస్థ కూలిపోయి సామ్యవాద వ్యవస్థ రావటానికి ఈ దోపిడీ వ్యవస్థలోనే బీజాలున్నాయి.

అందుకే ఈ దోపిడీ యిలాగే కొనసాగటానికి ప్రజలకు, కార్మిక, కర్షకులకు ఈ పాలకవర్గాలు తప్పుడు చైతన్యం కలిగించే కృషి నిరంతరం సాగిస్తాయి. ప్రజల చైతన్యాన్ని నిరంతరం. పక్కదార్లు పట్టిస్తుంది. అందుకు ఈ జన్మలోని కష్టాలన్నిటికీ పూర్వజన్మలోని పాపాలు కారణం అనే ఫిలాసఫీని నూరిపోసి కర్మసిద్ధాంతాన్ని నెత్తిన రుద్దుతుంది. బిర్లామందిరాలు కట్టిస్తుంది. వాళ్ళు అక్కడికీ వినకపోతే గూండాలతో తన్నిస్తుంది. దాన్నే

పోలీసు వ్యవస్థని పిలుస్తుంటారు. దీన్ని ఎదిరించే వాళ్ళని కాలరాచివేయాలి. అదే న్యాయవ్యవస్థ.

పూర్వం మొత్తం భూమి అంతా రాజుదేనట. 1840 దాకా భూమి మీద ఎవరికి వ్యక్తిగత హక్కులేదు. భూమిని దున్నుకున్నవాళ్ళు ఆరోవంతు పంట పన్నుగా రాజావసరాలకు కట్టేవాళ్ళట ! ఆ రాజుల్ని దోపిడీదారులన్నాం.బ్రిటీష్ వాళ్ళు, నైజాం రాజు పన్నులు వసూళ్ళకోసం బిల్లు కలెక్టర్లను నియమించారు. వారిని జమీందార్లు జాగీరుదార్లు అన్నారు. 1860 నుండి జమీందారుల, భూస్వాముల వ్యవస్థ స్థిరపడింది. ఈ భూసామ్య వ్యవస్థ అంతా యిటీవలిదే.

కాగా ఈనాడు ఒక కుటుంబం సగటున ఏటా 5600 రూ॥లు దోపిడీ చేయబడుతోంది. అంటే మూడింట రెండుపాళ్ళో, నాలుగింట మూడుపాళ్ళో ఈ పాలకవర్గాలు మన శ్రమశక్తిని, కష్టార్జితాన్ని ఎన్నో రూపాల్లో దోపిడీ చేస్తున్నాయి. అందుకు తమదయిన దోపిడి సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయి. ఈ భూస్వామ్య వ్యాపార సంస్కృతి పోవాలి. ఎలా పోతుంది? ఈ సరుకులు మారకపు విలువలకోసం కాకుండా, వస్తు మార్పిడి పరస్పర వినియోగం, ఉపయోగపు విలువల కోసం ఉత్పత్తి సాగించినపుడు ఈ దోపిడి అంతమవుతుంది.

హోటల్‌వాడు అన్నం పెట్టేది మారకపు విలువకోసం, నీవు యింటికొచ్చిన అతిథికి యింట్లో పెట్టకుండా హోటల్లో తినిపించి పంపించావనుకో. దానికీ నీవు యింట్లో ఆప్యాయంగా పెట్టే దానికీ ఎంతో తేడా! డబ్బు కోసం బర్రెపాలు అమ్మితే, నీవు బాబుకు పాలు పట్టడానికీ, నీవే స్తన్యమివ్వడానికీ ఎంత తేడాయో అంత తేడా. హోటల్ వాడికి నీ బిల్లు యివ్వడం లేటయితే నమస్తే అనేవాడే పరువు తీసి బజార్లో పెడతాడు. ఈ వ్యాపార సంస్కృతిలోని మర్యాదలు ఎంత కృత్రిమమైనవో చూడు. ఉపయోగపు విలువ కోసం వస్తుమార్పిడి కోసం తయారుచేసే సరుకులు సృష్టించే సంస్కృతి మన శరీరంలోని భాగాల్ని యిచ్చి పిల్లలుగా కడుపులో పెంచి, ఎదిగించి, కని, మనరక్తాన్ని, స్తన్యాన్ని, ప్రాణాన్ని యిచ్చి సాకడంలో వుండే ఆప్యాయతానురాగాలు వంటివి తద్వారా సహజమైన మహోన్నత మానవతా విలువలు పరిఢవిల్లుతాయి.

అక్కా! ఈనాడు మేం ఎంత శక్తివంతులమో తెల్సా! ఈనాడు ప్రతిపక్ష స్థానాన్ని ఆక్రమించాం. ఎరువుల ధరలు తగ్గాలని, గిట్టుబాటు ధరలు కావాలని, శాశ్వత కరువునివారణ చర్యలు చేపట్టాలని, దున్నేవాడికే భూమి చెందాలని, ఉద్యోగ భద్రత ఉండాలని, సంక్షేమ పథకాలు అమలుజరపాలని, నీటి వనరుల్ని, మానవ శ్రమశక్తిని వృథా కానీకుండా సక్రమంగా వినియోగించుకోవాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని ఎన్నోరూపాల్లో పోరాటాలు చేస్తున్నాం. నిజమైన ప్రతిపక్షాలు చేయాల్సిన నిజమైన పనులు యివే.

ఇలాంటి పోరాటాలద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను నిలవేసే స్థితికి, వారి చర్యలనూ, బడ్జెట్లనూ ప్రభావితం చేసే రూపంలో కంట్రోల్‌చేసే స్థితికి వచ్చాం. అటుచూడు బస్తర్లో 500 కోట్లతో బృహత్తర ప్రణాళిక చేపడతానని కనీసం వాగ్దానమైనా చేయాల్సిన అనివార్యస్థితికి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ నెట్టివేయబడ్డాడు. ఇటుచూడు అదిలాబాద్ జిల్లాని ఆదర్శ జిల్లాగా మార్చుతానని ముఖ్యమంత్రి కనీసం ప్రచారంకోసమైనా చెప్పుకోవాల్సిన స్థితికి తెచ్చాం. ఇదీ మా బలం. అందుకే ఈ వోట్ల పార్టీలన్నీ మేమంటే గజగజ వణుకుతాయి. అక్కసు వెళ్ళగక్కుతాయి.

వీళ్ళు బహిరంగంగా మమ్మల్ని ప్రతిపక్షంగా గుర్తించరు. మేమంటే వాళ్ళకు అంత భయం. ఆ భయాన్ని నోటితో చెప్పడానికిక్కూడా భయమే. కేవలం శాంతిభద్రతల సమస్యగా బుకాయిస్తుంది ప్రభుత్వం. కానీ హాస్టల్స్, వ్యవసాయ బ్యాంకులు, యింకేవో తనకు సంక్షేమ

కార్యక్రమాలని తోచినవాటిని అమలుపరిచే ప్రచారమైనా చేస్తుంది. మా క్రమాలని తోచినవాటిని అమలుపరిచే ప్రచారమైనా చేస్తుంది. మా పోరాటం మొదలుకాకపూర్వం మాటవరుసకి కరీంనగర్ జిల్లాలో కేవలం 58 హాస్టళ్ళుండేవి. ఈ పదేళ్ళకి ఈ సంఖ్య 140 దాకా చేరుకుంది. అట్లే ప్రజలు ఎన్నో రంగాల్లో చైతన్యవంతులయ్యారు. గత 7,8 ఏళ్ళుగా ప్రతిఏటా కరెంటు పంపుసెట్ల కనెక్షను తీసుకోవడంలో, ఫిలిం సొసైటీల్లో, రాష్ట్రానికి కరీంనగర్ జిల్లాదే ప్రథమస్థానం. ఈ కాస్త పోరాటానికే యిన్ని సాధిస్తూ యింత చైతన్యవంతులయితే మునుముందు యింకా ఎన్ని సాధించగలమో అని ప్రజలకు ఆత్మవిశ్వాసం పెరుగుతోంది.

నీకో విచిత్రం తెలుసా అక్కా ! ఈ టెర్రరిస్టు చట్టం వచ్చాక ప్రజలందర్నీ జైళ్ళలోకి తోసెయొచ్చుగా, ఇంత అలజడీ పోలీసు, సి.ఆర్.పి. పటాటోపం ఎందుకూ? అని అడిగాడీమధ్య ఒకాయన అసెంబ్లీలో ! పాపం ఆయనకు తెల్సినట్టులేదు. జిల్లాకో లక్షమందినయినా జైల్లో వేయాలిగా. అంటే కనీసం 23 లక్షల జనాన్ని జైల్లో పెట్టిసాకాలి. రోజుకు పన్నెండు రూపాయలు కేవలం వాళ్ళ తిండికే ఖర్చు పెట్టాలి. అంటే కేవలం ఒక లక్షమందిని జైల్లో పెడితే రోజుకి 12 లక్షలు తిండికి అనగా ఏడాదికి 43 కోట్ల 80 లక్షలు కావాలి. జైళ్ళ నిర్వహణకు మళ్ళీ యింత వేసుకో. కాగా పదిలక్షలయితే ఏటా 876 కోట్లు కావాలి.

అందుకే పోగాపోగా ఈ ప్రభుత్వాలు పంచదార కోటా లాగా పల్లెకు యింతమందిని అని కోటాలాగా అరెస్టు చేయగలదేగానీ చట్టబద్ధంగానయితే ఏమీ చేయలేదు. ఇథియోపియాలో తిండి పెడతానంటే జైల్లోకి వెళ్ళటానికి లక్షలమంది ప్రభుత్వపు కాలో చెయ్యో విరిచేసి ఆ నేరం కింద జైలుకెళ్ళడానికి రెడీగా ఉన్నారట! కానీ ప్రభుత్వం తుపాకుల్తో చంపుతోందేకానీ జైళ్ళలోకి తీసుకోవడంలేదు ! ఇక్కడ కొంతకాలం పోగాపోగా పోలీసులు, సైనిక ఆస్థులు, బలగాలకి జీతాలివ్వడానికే బడ్జెట్ పూర్తిగా ఖర్చు చేయాల్సి రావచ్చునేమో. ఇప్పటికే బోలెడు పెరిగిపోయింది. ఈ వ్యయాన్ని ఒక ఏడాది కేవలం 5 శాతం తగ్గిస్తే ఇప్పుడున్న స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్సిటీలు, టీచర్లు, ఉపాధ్యాయులు రెట్టింపు అవుతారు. అక్షరాస్యత రెట్టింపవుతుంది. అయినా ఈ పాలకవర్గాలు నిర్బంధాలకు పూనుకునే వంకర పరిష్కారానికే పూనుకొంటున్నాయి.

కాగా ఈ గ్రామాల్లో కూలినాలిజనం, పేదరైతులూ సంగబలంతో కష్టాలు కడతేరాలని పిడికిళ్ళు బిగించారు. పోరాటాలు చేశారు. పదేళ్ళకీ యిప్పటికీ పరిస్థితులు ఎంతో మారాయి. ఇవన్నీ ప్రజలు రక్తం ధారపోసి సాధించిన పోరాట విజయాలు, పదేళ్ళ క్రితం దాకా దొరలు చేసే పంచాయితీలు, దండుగలు, వెట్టిచాకిరీ, నజరానాలు, భూమి గుంజుకోవడాలు, లైంగిక దైర్జన్యాలు ఈనాడున్నాయా? ఈనాడు తమ సమస్యల్ని ప్రజా పంచాయితీల ద్వారా ప్రజలే పరిష్కరించుకొంటున్నారు. వాళ్ళ భూముల్ని వాళ్ళు తిరిగి తీసుకుంటున్నారు. మా శ్రమకు ఇంత కూలీ అని డిమాండ్ చేసి తీసుకోగలుగుతున్నారు.

ఇప్పుడు దొరలు, భూస్వాములు, బూర్జువాలు రకరకాల ముసుగుల్లో సంఘటితమవుతున్నారు. నాటి భూస్వాముల స్థానికీకరింపబడిన నిర్బంధం కేంద్రీకరించబడిన పోలీసు నిర్బంధంగా బిజెపి నిర్బంధంగా ముసుగుతీసేసి నగ్నంగా ముందుకొచ్చింది. బిజెపి నిర్బంధం కొందరికి విచిత్రంగా కనబడుతుంది. ఇక్కడ ఎవరికీ విచిత్రంగాలేదు. ఉదాహరణకి జగిత్యాల తాలూకా సెంటర్లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజి పేరు విన్నావా? కాసుగంటి నారాయణరావు కళాశాల. వీరు కరడుగట్టిన భూస్వామి. ముసలితనంలో పాపపరిహారార్థం, సత్రాలు అవీ కట్టించాడు. డిగ్రీ కాలేజీకి 40 ఎకరాల భూమి కొనియిచ్చి కాలేజీని తన పేరిట మార్చుకున్నాడు.

వీరి పుత్రుడు లక్ష్మీకాంతరావు ఇందిరా కాంగ్రెస్‌కు రెండుసార్లు ఎమ్మెల్యే. ఒకసారైతే 1967లో ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ ఎమ్మెల్యే. ఈ ఎమ్మెల్యే పుత్రుడు బిజెపి, ఆరెస్సెస్, విశ్వహిందూపరిషత్ ప్రముఖుడు. అంతేనా! రోటరీ క్లబ్బులో బాధ్యతాయుతమైన పదవీ, నాలుగయిదు బస్సులకు పర్మిట్లున్న వాడూ, బీరువాల్నించి ట్రాక్టర్ ట్రేలర్లదాకా తయారుచేసే 'గోదావరి వ్యాలీ ఇండస్ట్రీస్'కి అధిపతి.

ఇక్కడి భూస్వాముల చరిత్రంతా యిలాంటిదే. ఎవరికివారు వూళ్ళో స్వయంరాజులుగా స్వంతంగా అధికారం చెలాయించినవాళ్ళు. ఈ రోజు తాలూకా, జిల్లా, రాష్ట్ర, రాజధాని సెంటర్లలో పోగై నాయకులనే ముసుగులోనో, కాంట్రాక్టర్లనే ముసుగులోనో, పోలీసు అధికారులనే ముసుగులోనో మతం ముసుగులోనో, తల దాచుకుంటున్నారు . ఇలా ఒక మూలకు చేర్చబడ్డ వీళ్ళు, ప్రజాపోరాటపు మరో గట్టి అలతో అంతా అవుటవుతారు కబడ్డీలాగా!

ఆనాటి దొరలు కొందరు ఈనాడు రూపం మార్చుకున్నారు. కొందరు కొంతకాలం పారిపోయారు. కొందరు అటే ఉన్నారు. కొందరు తిరిగి వచ్చారు. చాలామంది సంగం అస్తిత్వాన్ని గుర్తించారు. అలా కొందరు రియల్ ఎస్టేట్స్ కట్టించుకుని అద్దెలపై వెళ్ళదీస్తున్నారు. కొందరు సర్పంచులుగా, కాంట్రాక్టర్లుగా, బ్రాందీషాపు యజమానులుగా, ప్రైవేటు బస్సు ఆపరేటర్లుగా, థియేటర్ మేనేజింగ్ పార్టనర్లుగా, సినీ నిర్మాతలుగా, అడ్వకేట్లు, పోలీసు అధికారులుగా, ఆఖరికి నీలా నాలా చిప్పలు కడగడానికి సైతం సిద్ధపడాల్సిన స్థితిని తెచ్చాం. హోటల్ ఓనర్లుగా రూపాంతరం చెందారు.

ఆనాడు ఎవరు కల్లు, సారా మామూలులా పట్టినా దొరకు యింత మామూలు అని వసూలు చేసేవాళ్ళు. దొరల పెత్తనం పోవడంతో అలా రావాల్సిన సొమ్ముని ఎందుకు వదలాలనే ప్రశ్నతో మొదలై సంగం చేతిలో అది ఎంత గొప్ప ఆయుధంగా అమరిందో తద్వారా గ్రామాభివృద్ధి ఎలా జరిగిందో ఆ క్రమంలో ఎన్ని మలుపులు తిరిగిందో పైనే చెప్పాను. కాగా అలా భూస్వాములు అన్నిరంగాల్లో కూర్చున్నచోట బెదిరించుకు తిని బతికిన రోజులు పోయాయి. ఈనాడు ఇలా లక్షల్లక్షలు పెట్టి థియేటరు కట్టినా కరెంటు పోతే ఈల వేసేవారికి లోకువ కావాల్సిన ఆవశ్యకతకి నెట్టేసి తద్వారా ప్రజలమధ్య నిలబెడ్తున్నాం. అంతేకాదు, ఫలానావాడు ఫలానావాడి పాలేరు అని తెలిసివుండికూడా రండి సార్ రండి అని మర్యాదచేసి హోటల్లో, జనరల్ స్టోర్సులో కూర్చోమని మర్యాద చేయాల్సిన స్థితి ఏర్పడింది. యివన్నీ ప్రజలకు పోరాటాల్లో భాగంగా పెరిగిన హక్కులు, గౌరవమర్యాదలు.

నేడు వాళ్ళు సంపాదన కోసం బిచ్చగాళ్ళలా ఎగబడాల్సి వస్తోంది. ఈ పదేళ్ళలో ఎంత మార్పు వచ్చిందో బేరీజు వేసుకో! ఇలా అందరి జీవన విధానాలే మారిపోయాయి. అసలు మేం ఎందుకోసం విప్లవిస్తున్నాం? జీవన విధానాలు మారడానికేగా! ఇదంతా అదేగా మరి! మా పోరాటక్రమంలో ఇది మొదటి మెట్టు. ఈ మొదటి మెట్టులో గ్రామాల్లో సమూలంగా మార్పులు వచ్చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ముందుకావచ్చు. మరికొన్నిచోట్ల ఆలస్యం కావొచ్చు. పాత సంబంధాల గొలుసులు (చిలుం) తుప్పుపట్టి తెగిపోతున్నాయి. కొత్త సంబంధాలు రూపుదిద్దుకుంటున్నాయి.

వికేంద్రీకృత స్వయంపోషక గ్రామీణ వ్యవస్థలో కనబడ్డ నాటి భూస్వామ్య దోపిడీ. నగ్నంగా కేంద్రీకృత, గ్రామీణ భూస్వామ్య దోపిడీ వ్యవస్థగా స్పష్టమవుతూంది. తద్వారా పెట్టుబడిని కూడా తన ఫ్యూడలైజేషన్‌కి అనువుగా (ఫ్యూడలైజేషన్ ఆఫ్ క్యాపిటల్) మార్చుతోంది. ఇలా పెట్టుబడియొక్క రూపం మారకుండానే స్వభావాన్ని మార్చడంగా ఫ్యూడలిజం ఎదుగుతోంది.

అనగా ఫ్యూడలిజం పెట్టుబడియొక్క రూపాల్లో తలదాచుకుంటోంది. ఈ కోపరేటివ్ బ్యాంకులూ, వగైరాలన్నీ ఇందుకు సాక్షీభూత రూపాలే. అంతెందుకు ఈ ప్రభుత్వమే అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ యొక్క 'కో ఆపరేటివ్ సొసైటీ' కదా! తాను ఒంటరిగా పెట్టుబడి పెట్టలేనని వాళ్ళకు తెలిసే కదా! రాయచూర్, గద్వాల, ఆలంపూర్ ఏరియాల్లో ప్రాజెక్టులు కడితే అటు మహబూబ్‌నగర్‌కు, ఇటు రాయలసీమకు సాగునీరు అంది ఆకలిచావులు తగ్గుతాయని తెలిసికూడా కేవలం పరిశ్రమ యజమానుల వ్యక్తిగత లాభాలకోసం 800 కోట్ల రూ॥ల ప్రజల సొమ్ముతో ప్రజల ప్రయోజనాల పేరిట శ్రీశైలంలో శ్రీశైలంలో జలవిద్యుత్ ప్రాజెక్టు కట్టించుకున్నారు. అందుకేగా రామగుండం బొగ్గుని కరెంటుగా మార్చుకుని ఎన్టీపిసి ద్వారా ఇతర రాష్ట్రాల పరిశ్రమాధిపతులకు సప్లయి చేస్తూ ఇక్కడి వ్యవసాయ పంపుసెట్లను లోవోల్టేజితో కాల్చివేస్తున్నారు.

కాగా ఈ రాష్ట్రంలోనూ బడా దళారీ బూర్జువాల పెట్టుబడులు కోట్లకొద్దిగా ఉన్నాయి. పోరాటాలు జరుగుతున్న విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలలో థాపర్లు, టాటాలు, బిర్లాలు, రష్యా, అమెరికాలు, అదిలాబాద్, కరీంనగర్‌లలోనేమో ప్రధానంగా బిర్లా, అమెరికా పెట్టుబడులే వున్నాయి. అంతేకాదు. ఈ రాష్ట్రంలోని జిల్లాల మార్కెట్లు కూడా అమెరికా, రష్యా తదితర దేశాలకు ఎంతో అవసరం. అందుకే భూస్వామ్య దళారీ బూర్జువా, అంతర్జాతీయ బూర్జువా ప్రయోజనాల కనువుగా ఇక్కడి పోరాటాలపై నిర్బంధాలు పెరుగుతుంటాయి. పెరుగుతున్నాయి. ఇందుకు బిజెపికానీ, మరే పార్టీగానీ మినహాయింపు కాదు. పైపెచ్చు భూస్వామి కానుగంటి నారాయణరావు మనుమడే ఈ మూడింటికి ప్రతీక కదా! అతను ఏకకాలంలో అటు భూస్వామిగా వుంటూనే అంతర్జాతీయ దోపిడీదారుల ఏజెంటు కూడా. కనుక నిర్బంధం బిజెపి, ఆరెస్సెస్, పోలీసు, స్వదేశీ, విదేశీ వగైరా ఎన్ని రూపాల్లో వున్నా వాటి సారాంశం ఒకటే. అందుకే మేం ఈ ప్రపంచ వ్యాప్త దోపిడీవ్యవస్థకి వ్యతిరేకంగా పోరాడుతున్నాం. కాగా ఇది సంధికాలం. పురుడు పోసుకున్నపుడు నొప్పులు ఎక్కువగానే ఉంటాయి. సంధికాలంలో సంఘర్షణ మరింత తీవ్రస్థాయిలో ఉండడం అనివార్యం. ఎమర్జెన్సీలో భూమయ్యా కిష్ట గౌడల్ని ఈ రాజ్యాంగం ఉరితీసింది. తద్వారా పోరాటాల్ని అణచివేశాననుకుంది. మేం మరింత పెరిగాం. చిత్రహింసలూ, దోపిడీలూ, కొనసాగించింది.

ఇలాకాదని యిక లాకప్పుల్లో హత్యచేయడం చేస్తున్నారు. ఎన్‌కౌంటర్ల పేరిట కనిపించినవారినల్లా కాల్చేస్తున్నారు. నీవు ఇక్కడో విషయం గమనించావా. భూమయ్యా, కిష్టాగౌడుల ఉరితీతపట్ల ప్రపంచవ్యాప్తంగా ఆందోళన సాగింది. ఇక అప్పటినుండి నేటివరకు విప్లవకారుల ఉరితీతలు ఆగిపోయాయి. అవి లాకప్పు హత్యలుగా, ఎన్‌కౌంటర్లుగా రూపాంతరం చెందాయి. అనగా పదేళ్ళక్రితం రాజ్యాంగంద్వారా ఈ మా పోరాటాల్ని అణచాలనుకున్నవాళ్ళు అణచలేకపోయారు. ఇక రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి 'యిష్టారాజ్యాంగం' వుత్తర్వులు జారీ చేశారు. అంటే ప్రభుత్వాలు రాజ్యాంగంతోసహా అవి తమ లెజిటిమసీని కోల్పోయాయి.

ఎప్పుడయితే రాజ్యాంగం, ప్రభుత్వాలు మా పోరాటాల యెడల చెత్తకుండీలయి తమ నిస్సహాయతని వ్యక్తం చేశాయో ఆ తర్వాత తీసుకున్న ప్రభుత్వ చర్యలన్నీ దేనికి నిదర్శనం? ఈ దేశంలో జరుగుతున్న అంతర్యుద్ధానికి నిదర్శనం – అంతర్యుద్ధంలో ఎదుటి పక్షాన్ని బలహీనపరచడమే పరమావధి. అలా ఈ రోజు పాలకవర్గాలు తమ ప్రజాస్వామ్య ముసుగు చింపేసి అసలు స్వరూపాన్ని బయటపెట్టుకుంటున్నాయి. అంతర్యుద్ధం సాగుతోంది. ఇరుపక్షాలూ భీకరంగా మరింత భీకరంగా సోగాడ్డం తప్పనిసరి. ఇంకా మాలో ఎంతోమందిని కోల్పోతామని

తెలుసు అక్కా ! ఏ త్యాగం లేకుండా ఏ ఫలితం లేదు. అందుకు మేం సిద్ధపడే వున్నాం. అదిగో! అంతర్యుద్ధం సాగుతోంది. మా పోరాట సాంప్రదాయంలో మేం యింతదాకా అందరికన్నా ముందున్నాం. అలా ఎర్రజెండాను మరింత సమున్నతంగా ఎరుపెక్కిస్తూ ఆ సాంప్రదాయాన్ని కాపాడుకుందాం.

అక్కా ! ముందే చెప్పినట్టు మన యిల్లు చక్కదిద్దుకోవాలనుకుంటే దేశాన్ని చక్కదిద్దాలి. దేశాన్ని చక్కదిద్దితేనే మన యిల్లు చక్కదిద్దబడుతుంది. అంటే నీవూ, నేనూ మన యిల్లు చక్కదిద్దుకోవడమంటే ఈ దేశాన్ని, ఈ వ్యవస్థని చక్కదిద్దుకోవడం, అంతేకాని కేవలం జీతాల పెరుగుదల అనే వూబిలో దిగబడి ఒక్క కిస్తు డి.ఏ.నో, పదో పరకో జీతం పెంచితేనో, బోనస్ యిస్తేనో సరిదిద్దబడేది కాదు. అందుకే పోరాటంలో మాతో చేయికలుపు. జీతాల పెరుగుదలకీ, గానెగెద్దు జీవితానికి బందీచేసిన ద్రోహుల బంధనాలనించి విముక్తం కా!

అక్కా ! చరిత్ర పరిగెడుతోంది. కాదు చరిత్రను సృష్టిస్తున్నాం. అంతర్యుద్ధం జరుగుతోంది. కలిసిరా! అలిసిపోకు. నీవు ఇంకా శక్తివంతురాలివే. సంకోచాలు భయాలు వదలి రా! నీవు అక్కవై, నేను చెల్లెలినై నీవు సుత్తివై, నేను కొడవలినై మన జెండాకు హత్తుకుందాం రా అక్కా కలిసిరా! ఈ దోపిడీ వ్యవస్థని సమూలంగా నిర్మూలించి మారకపు విలువల కోసం కాకుండా ఉపయోగపు విలువలకోసం సరుకులు సృష్టిద్దాం. దోపిడీ పీడన లేని నవసమాజాన్ని సమసమాజాన్ని నిర్మిద్దాం. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేద్దాం. కృత్రిమ నాగరికతా విలువలు లేని తల్లీకొడుకుల్లా మానవ ప్రపంచమంతా మహోన్నత మానవీయ విలువలు పరిఢవిల్లే నూతన వ్యవస్థకు పురుడు పోసుకుందాం! రా! అక్కయ్యా కలిసి రా!

– నీ చెల్లెలు

"ఇల్లు" పేరుతో అరుణతార మాసపత్రిక సెప్టెంబరు 1988